
# తెమీనచా - నమీతెచా



అనగా అనగా ఒక అడవి. ఆ అడవి పేరు కొత్త అడవి. ఇది కొత్త అడవి అయితే మరి పాత అడవి ఎక్కడ ఉంది అని అడగకండి. ఇంకొక పేరా అయిన తర్వాత ఆ విషయం చెబుతాను.

ఆ అడవిలో, అది చారల గాడిదలు వుండేచోటు. చారల గాడిదలు అంటే ఇంగ్లీషులో జీబ్రాలు అన్నమాట. ఇంగ్లీషులో నిజంగా జీబ్రాలు అనరు. తెలుగు వాళ్లు ఇంగ్లీషులో అలా అంటారు. అదే మలయాళీలు అయితే సీబ్రాలు అంటారు. తమిళులు సరిగ్గా పలుకుతారు. కానీ అది తెలుగులో రాసేటప్పుడు 'జీబ్రా' అని రాస్తాం. ఎందుకంటే జీబ్రాల్‌ని 'జీ' - మన తెలుగు లిపిలో లేదు కనుక.

సరే - ఆ జీబ్రాలు కొత్త అడవిలో సుఖంగా జీవిస్తున్నాయి. అది కొత్త అడవి అనటానికి కారణం ఉంది. అంతకుముందు ఆ జంతువులన్నీ చాలా దూరంగా ఉన్న పాత అడవిలో, అందమైన ఒక నది ఒడ్డున ఉండేవి. అక్కడ జీబ్రాల జనాభా మరీ ఎక్కువయిపోవటంతో అక్కడ ఉన్న గడ్డి చాలకపోవటంతో అవకాశాలు తక్కువయిపోయాయి. ఎక్కడ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయా అని మంచి ప్రదేశాల కోసం వెదుకుతే ఈ కొత్త అడవి కనపడింది. కొత్త అడవిలో గడ్డి చాలా ఏపుగా పెరిగి ఉన్నది - పక్కనే మంచినీరు. శుభ్రమైన పరిసరాలు. దానితో ఉత్సాహవంతులూ, ఆశాజీవులూ అయిన కొన్ని జీబ్రాలు కొత్త అడవికి వచ్చాయి. అక్కడ చాలా సుఖంగా

ఉన్నాయి. అవకాశం వచ్చినప్పుడల్లా, పాత అడవి నించి, కావలసిన వాళ్లను. తెలిసినవాళ్ళను - కొత్త అడవికి తీసుకువస్తున్నారు. దాని ఫలితంగా కొత్త అడవికి, కొద్ది సంవత్సరాలలోనే చాలా జీబ్రాలు చేరాయి.

మిగతా జంతువులతో కలిసిమెలిసి తిరిగినా, జీబ్రాలు అన్నీ కలిసికట్టుగా ఉంటూ, ఆ కొత్త అడవికే కొత్త అందాలు తెచ్చి, మంచి పేరు తెచ్చుకున్నాయి.

ఒకసారి, జీబ్రాలు అన్నీ సంతోషంతో పండుగ జరుపుకుంటున్నప్పుడు, పాత అడవి నుంచి అక్కడి జీబ్రాల నాయకుడు వచ్చాడు.

ఆ పండుగ ఉత్సవాలలో అందరూ కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు.

పాత అడవి నాయకుడి పక్కన చేరి, అతని కటాక్షం కోసం ఎదురు చూస్తున్న కొన్ని జీబ్రాలు నది ఒడ్డున అతని చుట్టూతా చేరి అతని మాటలు వినసాగాయి.

"అన్ని జీబ్రాలు ఒకటి కాదు. వీటిలో తేడాలు వున్నాయి. మనం రాజవంశానికి చెందిన జీబ్రాలం. మిగతా జీబ్రాలు వర్తి 'ఏబ్రాసి' జీబ్రాలు. కనుక ఆ ఏబ్రాసి జీబ్రాల మీద, మన గొప్పతనం చూపించాలి. మనతో కలసిమెలసి వుండే అర్హత వాళ్లకు లేదు!" అని ఆ పది జీబ్రాలకూ పురి ఎక్కించాడు.

వాటిలో మూడు జీబ్రాలకు ఆ మాటలు నచ్చలేదు. "పాత అడవిలో అలాటి తేడాలు వున్నాయి కానీ, ఇక్కడ అలాటివేమీ లేవు. ఇది కొత్త అడవి. మావన్నీ కొత్త భావాలు. మా ఉద్దేశ్యంలో అందరూ ఒకటే - మీరు ఇంకా పాతకాలంలో ఉన్నారు!" అన్నాయి.

ఈ పండుగ ఉత్సవాలు తన ఆధ్వర్యంలో నడిపించిన పెద్ద జీబ్రా - "మనం ఏ అడవిలో ఉన్నా మన భావాలు ఒకటే. మనలో తరతరాలుగా జీర్ణించుకుపోయిన భావాలు మారవు. మారకూడదు. మీకు ఆయన చెప్పింది ఇష్టం లేకపోతే, తోక ఊపుకుంటూ వెళ్లిపొండి! మేము ఏమీ అనుకోము!" అన్నాడు.

ఆ మూడు జీబ్రాలు ఈసడింపుగా చూసి వెళ్లిపోయాయి. తోక ఊపుకోకుండా వెడదామనుకున్నాయి గానీ, నడుస్తుంటే అలవాటు ప్రకారం తోకలు ఊగుతూనే ఉన్నాయి.

పాత అడవి నాయకుడు అన్నాడు - "మన జాతి పేరు 'తెమీనచా' జాతి. అంటే మేలు జాతి. మిగతా ఏబ్రాసి జీబ్రాలను కొంచెం దూరంగా ఉంచండి!"

చివరగా పడుకుని, నెమ్మదిగా గడ్డి నెమరువేస్తున్న పిల్ల జీబ్రా - గడ్డి చాలాసేపటినించీ నెమరువేస్తున్నాను కదా, ఇక చాల్లే అనుకుని - అ గడ్డిని మింగేసి, బ్రేవ్‌మని త్రేన్చి అడిగింది -

"నాకొకటి అర్థం కాలేదు. 'తెమినచా' అంటే ఏమిటి?" అని.

ఎవరూ మాట్లాడలేదు.

పెద్ద జీబ్రా మాత్రం, ఆ మాత్రం నీకు తెలీదా అన్నట్లు చూసింది పిల్ల జీబ్రాను.

" 'తెమినచా' అంటే మేలు జాతి అన్నారు మీరు. కానీ 'తెమినచా' అంటే అర్థం ఏమిటీ అని" సాగదీసింది పిల్ల జీబ్రా, కంటి మీద ఈగ వాలటంతో కళ్లు టపటపా ఆర్పి.

పాత అడవి నాయకుడు అన్నాడు - "ఈ అడవిలో పెద్దగా చెప్పటం మంచిది కాదు. చెట్లకు చెవులుంటాయి 'తెమినచా' అంటే....." పెద్ద జీబ్రా చెవిలో చెప్పాడు రహస్యంగా.

పిల్ల జీబ్రా అసహనంగా తోక ఊపుతూ అన్నది - "నాకు చెప్పవా?" అని.

పెద్ద జీబ్రా అందరివేపూ ఒకసారి నిశితంగా చూసింది. తల ఊపి, ముందు పిల్ల జీబ్రా చెవిలో చెప్పింది. తర్వాత అక్కడున్న మిగతా జీబ్రాల చెవిలో చెప్పింది.

"అదీ దీని అర్థం. మనందరం ఒకటేనని 'తెమినచా' జాతి జీబ్రాల చెవుల్లో చెప్పండి. పైకి మాత్రం అనకండి. చెప్పానుగా చెట్లకు చెవులుంటాయని!" అన్నది.

పిల్ల జీబ్రా చెట్ల వేపు చూసింది - వాటికి చెవులెక్కడున్నాయా అని.

ఆరోజునించీ 'తెమినచా' జీబ్రాలు తమ ఆధిఖ్యాన్ని చూపిస్తూ, తమ జాతివారిని గౌరవిస్తూ మిగతా జీబ్రాలను యథాశక్తి అగౌరవిస్తూ వాళ్లని చిన్నచూపు చూడటం సాగించాయి.

తరువాత కొన్నాళ్లకు పాత అడవిలో పోట్లాటలు వచ్చి, ఆ నాయకుడిని వినాయకుడిని చేసి ఒక మూల కూర్చోపెట్టాడు కొత్త నాయకుడు. కొత్త నాయకుడు పాత అడవికి కొత్తగా నాయకుడయ్యాడు.

అదే సమయంలో కొత్త అడవిలోని ఏ బ్రాసి జీబ్రాలలో ఒక పది మంది పండుగ ఉత్సవాలు చేసుకుంటూ - కొత్త నాయకుడిని కొత్త అడవికి ఆహ్వానించారు. కొత్త నాయకుడు చాలా సరదాగా అందర్నీ నవ్వించి సంతోషపెట్టి, తనూ సంతోషించాడు.

మరునాడు తనని సన్మానించిన పదిమంది చెంచాలతోనూ, వాహ్యాళికి వెడుతున్నప్పుడు ఒక ముసలి జీబ్రా అన్నది - "ఇక్కడ 'తెమినచా' జాతివాళ్ల అగడం ఎక్కువయింది. మమ్మల్ని ఏబ్రాసి జీబ్రాలు అంటున్నారు!" అన్నాడు.

అది విని కొత్త నాయకుడు విరగబడి నవ్వాడు. నవ్వటం అయిన తర్వాత విరగబడటం ఆపేసి, "వాళ్లు మిమ్మల్ని ఏ బ్రాసి జీబ్రాలు అంటే మీరు ఏబ్రాసి జీబ్రాలు అయిపోతారా? మీరు ఏ బ్రాసులు కాదు, గీబ్రాసులూ కాదు. 'నమితెచా' జాతికి చెందిన జీబ్రాలు. 'తెమినచా'

జాతి వాళ్లకన్నా మన 'నమితెచా' జాతి వాళ్లం అధికులం. తెలివిగల వాళ్లం. మనకు వాళ్లు సాటి కారు. మన రెండు జాతులకు చెందని జీబ్రాలున్నాయో, అవీ ఏబ్రాసి జీబ్రాలు!'' అన్నాడు.

అక్కడే చెవులు నిక్కబొడుచుకుని వింటున్న ఒక కుర్ర జీబ్రా అన్నది - "గురూ జీబ్రాగారూ! అయితే మనం అందరికన్నా అగ్రజాతి వాళ్లమా?''

"అందుకు అనుమానమా! అలా అనుమానం రావటమే మన జాతికి పెద్ద అవమానం!'' అన్నాడు కొత్త నాయకుడు. పెద్ద గొంతుతో, నాటక ఫక్కీలో.

కుర్ర జీబ్రా బుర్ర గోక్కుంది. తల వంచి, కుడిపక్క ముందు కాలుతో గోక్కోటం అయ్యాక కాలు కిందపెట్టి మళ్లీ అన్నది - "మరి మనం 'నమితెచా' జాతికి చెందిన జీబ్రాలం అన్నారు కదా! 'నమితెచా' అంటే ఏమిటో సెలవిస్తారా?''

కొత్త నాయకుడు ఈసారి అవసరం కాకపోయినా వికటాట్టహాసం చేశాడు. చేసిన తర్వాత ఒక క్షణం గుండెల నిండా బోలెడు గాలి పీల్చుకుని, బయటకు వదిలి చుట్టూ చూశాడు. అక్కడ చెట్లు వున్నాయి.

"ష్! నెమ్మదిగా మాట్లాడండి! చెట్లకు చెవులుంటాయి!'' అని కుర్రజీబ్రా చెవిలో చెప్పాడు 'నమితెచా' అంటే ఏమిటో!

వినగానే చెవులు నిక్కబొడుచుకుని. చెంగున ఎగిరి గంతేసింది కుర్ర జీబ్రా.

ముసలి జీబ్రా కోపంగా అన్నది - "అలా గంతులు వేయటం మాని నిటారుగా నుంచుని చెప్పు. నువ్వెప్పుడూ ఇంతే! క్రమశిక్షణ బొత్తిగా లేదు!''

కుర్రజీబ్రా గంతులు వేయటం మాని, నిటారుగా నుంచుని క్రమశిక్షణతో అన్నది - "నమితెచా'' అంటే....!''

కుర్ర జీబ్రా అక్కడున్న అందరి చెవులలోనూ 'నమితెచా' అంటే అర్థం ఏమిటో చెప్పింది.

ఆరోజునుంచీ కొత్త అడవిలో 'తెమినచా' జాతివారు, 'నమితెచా' జాతివారు వేరువేరుగా పండుగలు జరుపుకోవటం, ఎవరి ఆధిక్యత వాళ్లు చూపుకోవటం, సమయం దొరికినప్పుడల్లా ఒకళ్లనొకళ్లు తిట్టుకోవడం చేయసాగారు.

జీబ్రాలు అంటే చారల గాడిదలు కనుక, అప్పుడప్పుడూ వెనక కాళ్ల దగ్గర, ఇతర జాతి వాళ్లు అజాగ్రత్తగా వుంటే, కాళ్లు ఝాడించటం కూడా చేయసాగారు.

అలా కొత్త అడవిలో కూడా పాత అలవాట్లు పోకుండా, పురిటి వాసన అలానే నిలిచిపోయింది.

అయినా 'తెమినచా', 'నమితెచా' జాతులలోనె చాలామంది ఈ విభజనను సమర్థించకుండా, మిగతా జీబ్రాలతో కలిసిమెలసి తిరగసాగారు. ముఖ్యంగా యువరక్తం, ఈ పెద్దవాళ్ల పురాతన భావాలను అసహ్యించుకుని, జీబ్రాలను వదిలివేసి మిగతా జంతువులతో కలిసి తిరగసాగారు.

★ ★ ★

ఈ కథంతా చూస్తూ చెట్టు మీద గంతులేస్తున్న కోతులు రెండు ఆశ్చర్యపోయాయి.

ఎర్రకోతి అన్నది - "నాకు జీబ్రాలు అన్నీ ఒకటిగానే కనపడుతున్నాయి. ఏమీ తేడా తెలియటం లేదు. ఒకే రంగు, ఒక పద్ధతి! నాలుగే కాళ్ల రెండే చెవులు, రెండే కళ్లు, ఒకే తోక! అయినా వేరు వేరు అనే భావనతో, వేరు పడతారేమిటి?"

నల్లకోతి నవ్వింది - "అవును, నీ జీవితంలో మొదటిసారిగా నిజం చెప్పావు.

"అయినా నాకర్థం కాని దొకటున్నది. వాళ్లు 'తెమినచా' జాతి, 'నమితెచా' జాతి అంటారేమిటి? వాటికర్థం ఏమిటి?"

నల్లకోతి ఈసారి ఇంకా పెద్దగా నవ్వింది - "అది గాడిదల భాషలే. 'తెమినచా' అంటే తెలుపు మీద నలుపు చారల గాడిద అని. 'నమితెచా' అంటే నలుపు మీద తెలుపు చారల గాడిద అని!"

ఎర్రకోతి బుర్రగోక్కుందామనుకుంటే, పేలు అడ్డం వచ్చాయి. పేలను చేత్తో దులిపేసి, బుర్ర గోక్కోకుండా అన్నది - "తెలుపు మీద నలుపో, నలుపు మీద తెలుపో నాకు తెలీదు. నాకు మాత్రం తెలుపు. నలుపు చారలు పక్కపక్కనే కనపడుతున్నాయి. నా ఉద్దేశ్యంలో అన్నీ ఒక్కటే! మరి వాళ్లకా విషయం ఎందుకు అర్థంకాదు?"

నల్లకోతి అన్నది - "ష్! నెమ్మదిగా మాట్లాడు. ఆ జీబ్రాలకు చెవులున్నాయి. నువ్వు చెప్పింది విన్నాయంటే, ఇంకో మూడో జాతి మొదలవుతుంది - అసలే గాడిదలు!"

ఎర్రకోతి ఎడంచేత్తో నోరు మూసుకుంది. ●

*(ఆంధ్రప్రభ , సచిత్రవార పత్రిక: సెప్టెంబరు 21, 1998)*